www.nagaranijam.com

PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com

అక్షరనిజం నగరనిజం

తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

సంపుటి : 13 | సంచిక :354 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 13 శుక్రవారం, మార్చి 2026 | పేజీలు : 4+ | ₹ 3

Volume : 13 | Issue : 354 | Rangareddy | Editor : Yela.Purushotham | 13 Friday , MARCH 2026 | Pages : 4 + | Price : 3/-

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## కాసుల కోసం కక్కుర్తి వద్దు... సేవా భావంతో

# వైద్యం అందించండి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- శంషాబాద్ లిమ్స్ హాస్పిటల్స్ న్యూరాలజీ కార్డియాలజీ ఆసుపత్రిని ప్రారంభించిన డిప్యూటీ సీఎం
- ప్రారంభోత్సవ వేడుకకు హాజరైన ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, ఈర్లపల్లి శంకర్
- పేదల సంక్షేమం కోసం నియోజకవర్గాల వారీగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామన్న డిప్యూటీ సీఎం
- లిమ్స్ హాస్పిటల్స్ సేవలను కొనియాడిన మల్లు భట్టి విక్రమార్క

**రాజేంద్రనగర్, మార్చి 12 (నగరనిజం ప్రతినిధి):** ధనార్జనే ధ్యేయంగా పెట్టుకోకుండా సేవా దృక్పథంతో సామాన్య ప్రజలకు వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. కార్పొరేట్ ఆసుపత్రులు ధనార్జనే ధ్యేయంగా పెట్టుకుంటుండడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు వైద్య సేవల కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాలంటే ఉన్న భూములను లేదా మహిళల మెడలో ఉన్న మంగళ సూత్రాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ వందల కోట్ల వ్యయంతో ఉస్మానియా ఆసుపత్రికి కార్పొరేట్ స్థాయి హంగులతో పునర్నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క.... నియోజకవర్గాల వారీగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద లిమ్స్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రామరాజ్ సారథ్యంలో నెలకొల్పిన లిమ్స్ న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రిని గురువారం నాడు లాంఛనంగా ప్రారంభించారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, షాద్నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ తో కలిసి ఆసుపత్రిని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.... ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. నేటి సమాజంలో కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని పేద ప్రజల నుండి ముక్కు పిండి చార్జీలు వసూలు చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాలంటే ఉన్న భూములు, లేదా మహిళల మెడలో ఉన్న మంగళ సూత్రాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలపొందని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని డబ్బుల కోసం కాకుండా సేవా దృక్పథంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలని భట్టి విక్రమార్క సూచించారు. రేవంత్ రెడ్డి సారద్యంలోని ప్రజా ప్రభుత్వం సామాన్య మధ్యతరగతి ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీఠ వేస్తూ నియోజకవర్గాల వారీగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటుందని



చెప్పారు. మరోవైపు వందల కోట్లు వెచ్చించి కార్పొరేట్ స్థాయి హంగులతో ఉస్మానియా ఆసుపత్రి పునర్నిర్మాణం చేస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ రామరాజు సారధ్యంలోని లిమ్స్ హాస్పిటల్స్ వైద్యుల బృందం ప్రజల ఆదరాభిమానాలతో ఆరు బ్రాంచీలను నెలకొల్పడం అభినందనీయమన్నారు. సేవా దృక్పథంతో ప్రజలకు సేవలు అందిస్తున్న లిమ్స్ హాస్పిటల్స్ యాజమాన్యాన్ని, తోటి వైద్య సిబ్బందిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభినందించారు. పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రభుత్వ సహకారం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. లిమ్స్ హాస్పిటల్స్ యాజమాన్యం భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని మరిన్ని బ్రాంచీలు ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

### లిమ్స్ హాస్పిటల్స్ సేవలపై ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ ప్రశంసల జల్లు

లిమ్స్ హాస్పిటల్స్ యాజమాన్యం సేవా దృక్పథంతో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తీరు పట్ల షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రశంసల జల్లు కురిపించారు. కాసుల కోసం కాకుండా ప్రజల ఆశీస్సులు పొందేలా వైద్య సేవలు అందించాలని, లిమ్స్ హాస్పిటల్స్ యాజమాన్యం ఆ దారిలో నడుస్తుండడం శుభ పరిణామం అని ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ ప్రశంసించారు. శంషాబాద్ వద్ద హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి పక్కన న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రిని నెలకొల్పడం అభినందనీయమన్నారు. శంషాబాద్ వద్ద నెలకొల్పిన లిమ్స్ కార్డియాలజీ ఆసుపత్రి తో షాద్నగర్, జడ్చర్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ అభిప్రాయపడ్డారు. అధునాతన వైద్య సదుపాయాలతో కూడిన కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి శంషాబాద్ లో అందుబాటులోకి రావడం అభినందనీయమని ఆయన లిమ్స్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు.

### వైద్యులు దేవుడితో సమానం - వేద విద్యానంద స్వామి

రోగులకు ప్రాణాలు పోసే వైద్యులు దేవుడితో సమానమని బాసర పీఠాధిపతి వేద విద్యానంద స్వామి అభిప్రాయపడ్డారు. అలాంటి వైద్య వృత్తిలో కొనసాగుతున్న ప్రతి ఒక్కరూ ధన్యులని ఆయన పేర్కొన్నారు. శంషాబాద్ వద్ద సామాన్య మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే వైద్య సేవలు అందిస్తున్న లిమ్స్ హాస్పిటల్ యాజమాన్యాన్ని విద్యానంద స్వామి అభినందించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, బాసర పీఠాధిపతి వేద విద్యానంద స్వామీజీ, శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్వి రాజు ముదిరాజ్, శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నేతలు కొడిగంటి చంద్రారెడ్డి, దూడల వెంకటేష్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్, శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, సినీ నటుడు రచ్చ రవి,మాజీ కౌన్సిలర్లు వై.కుమార్, మేకల వెంకటేష్ ముదిరాజ్, పారేపల్లి లావణ్య శ్రీనివాస్ గౌడ్,ఉప్పునుంతల అజయ్, మాజీ సర్పంచులు దండు ఇస్తారి, కేతావత్ రాము నాయక్,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు దిద్యాల జయమ్మ శ్రీనివాస్ (శంషాబాద్ మండల్ మాజీ ఎంపీపీ), బూరుకుంట సతీష్ (డిసిసిబి మాజీ డైరెక్టర్),కొనమొల్ల శ్రీనివాస్, మంచర్ల మోహన్ రావు, రాచమల్ల జయసింహ, చిన్నగండు రాజేందర్, వెంకట్ రెడ్డి, హనుమంతు ముదిరాజ్, గుంటి చరణ్ తదితర నేతలను హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రామరాజ్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లిమ్స్ హాస్పిటల్స్ వైద్యుల బృందం డాక్టర్ రామరాజ్, డాక్టర్ గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ కార్తీక్ గౌడ్, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ లలిత్ కుమార్ రెడ్డి, డాక్టర్ నిషిత్ రెడ్డి, డాక్టర్ కిరణ్ తేజ్, డాక్టర్ విజయ్ భాస్కర్, డాక్టర్ సింధు, డాక్టర్ శ్రీనాథ్ వసగిరి, డాక్టర్ స్మిత రామరాజ్, డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శంకర్ రెడ్డి, డాక్టర్ యశోదర, డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ సత్యేంద్ర,డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

- ప్రజాప్రతినిదులు 99 రోజుల కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 ( నగరనిజం ) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారం గ్రామంలోని వర్ధమాన ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్యతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొనీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా సర్పంచులుగా ఎన్నికైన అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కొత్తగా ఎన్నికైన మీరంతా మీ సమయాన్ని వృధా చేయకుండా గ్రామాభివృద్ధికి సమయాన్ని వెచ్చించాలని



గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేసేలా ఎక్కడ ఎలాంటి వైరుధ్యాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. 99 రోజుల పాటు పది అంశాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ఇందులో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు కీలకంగా ఉండాల్సినందున వారికి సమగ్రంగా అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్, అధికారులు నివృతి చేస్తారన్నారు. 99 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమం




విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ... ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించి వారిని పథకాల అమలులో భాగస్వాములను చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందజేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఐడీ కార్డులను, 99 రోజుల ప్రణాళిక బుక్స్ అందజేయడం జరిగింది. అనంతరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా అధికారులు, మండలాల అధికారులు, సర్పంచులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీకగా గ్రాండ్ ఇఫ్తార్ పార్టీ

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





**ఎల్బీనగర్, మార్చి 12 (నగర నిజం):** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గురుద్వారా రోడ్ ప్రధాన రహదారి వద్ద ముదబ్బీర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ ఇఫ్తార్ పార్టీలో "ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి" పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పండుగలు అన్ని మతాల ప్రజలను కలిపే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పండుగలను సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, మధు గౌడ్, నవీద్, సంజయ్, కిషోర్ కుమార్ తదితర బీఆర్ఎస్ నాయకులు, ముస్లిం పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డికి శంషాబాద్ కాంగ్రెస్ నేతల అభినందన

- రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన నరేందర్ రెడ్డి ని ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నేతలు నరేందర్, గడ్డం శేఖర్ యాదవ్, సంజయ్ యాదవ్





**రాజేంద్రనగర్, మార్చి 12 (నగరనిజం ప్రతినిధి):** రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ప్రభుత్వం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని పలువురు శంషాబాద్ కాంగ్రెస్ నేతలు అభినందించారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ కు చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ జెల్లపల్లి నరేందర్, శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్, శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్ తదితర నేతల బృందం నరేందర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావడం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్, శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వేం నరేందర్ రెడ్డిని అభినందించిన నేతలు... ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాల 'అంతులేని' దందా!





- భద్రతా ప్రమాణాలు గాలికి.. అధికారుల అండతో రెచ్చిపోతున్న బిల్డర్లు
- GG 2 అనుమతులతో GG5 కట్టడాలు. అక్రమ నిర్మాణాలకు ఇంటి నంబర్లు కేటాయింపులో భారీ కుంభకోణం?
- ఏసీబీ విచారణ జరిపించాలని స్థానికుల డిమాండ్

### జిల్లా కలెక్టర్ గారు స్పందిస్తారా లేదా?

**నగర నిజం ప్రతినిధి, మార్చి 12** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీ అక్రమ కట్టడాలకు అడ్డాగా మారింది. నిబంధనలను తుంగలో తొక్కి, భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి బిల్డర్లు యథేచ్ఛగా సాగిస్తున్న నిర్మాణ పర్వం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తర్వాతనైనా పారదర్శకత వస్తుందని ఆశించిన ప్రజలకు, ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మింగుడు పడటం లేదు.

### పాత అనుమతులు.. కొత్త అంతస్తులు!

గతంలో గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో తీసుకున్న GG2 (రెండు అంతస్తుల) అనుమతులను సాకుగా చూపిస్తూ, ఇప్పుడు ఏకంగా GG3, GG4, మరియు GG5 అంతస్తుల వరకు భారీ భవనాలను నిర్మిస్తున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం మల్టీ స్టోరీ భవనాలకు ఉండాల్సిన కనీస సెట్‌బ్యాక్స్ (ఖాళీ స్థలం), పార్కింగ్ సౌకర్యం ఎక్కడా కనిపించడం లేదు. పాత అనుమతులనే సాకుగా చూపిస్తూ కొత్తగా ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ మాయాజాలం కొనసాగుతోంది.

### అధికారుల అండ.. 'నెంబర్' ఇస్తే చాలు అంతా మా ఇష్టం!

ఈ అక్రమ కట్టడాల వెనుక టౌన్ ప్లానింగ్ అధికారుల హస్తం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీస పత్రాలు లేకపోయినా, నిబంధనలు ఉల్లంఘించినా సరే.. భారీగా ముడుపులు అందుతుండటంతో అధికారులు అక్రమ నిర్మాణాలకు సైతం ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లికేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప, క్షేత్రస్థాయిలో కూల్చివేతలు లేవు. అధికారుల అండ చూసుకునే బిల్డర్లు రెచ్చిపోతున్నారు" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మృత్యుపాశాలుగా మారుతున్న భవనాలు

భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల భవిష్యత్తులో ఈ భవనాలు ప్రమాదాలకు నిలయంగా మారే అవకాశం ఉంది.

### ఫైర్ సేఫ్టీ నిల్:

అగ్నిప్రమాదం జరిగితే కనీసం ఫైర్ ఇంజిన్ వెళ్లేందుకు కూడా దారి లేని రీతిలో రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.

### డ్రైనేజీ సమస్య:

సరైన ప్లానింగ్ లేకపోవడంతో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. వర్షాకాలంలో ఈ ప్రాంతం జలమయమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

### ఏసీబీ విచారణకు డిమాండ్.. కలెక్టర్ జోక్యం కోరుతున్న ప్రజలు

ఇంద్రేశం మున్సిపాలిటీలో జరుగుతున్న ఈ భారీ అవినీతిపై ఏసీబీ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల ఆస్తులపై, వారు అక్రమంగా కేటాయించిన ఇంటి నంబర్ల ఫైళ్లపై దర్యాప్తు జరపాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ నిర్మాణాలను నిలిపివేయడమే కాకుండా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించి, అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఇంద్రేశం ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సామాన్యుడు ఒక చిన్న ఇల్లు కట్టుకోవాలంటే నిబంధనలు అడ్డు చెప్పే అధికారులు, బిల్డర్ల విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారో సమాధానం చెప్పాలని వారు ప్రశ్నిస్తున్నారు.





# పరిశోధనలో డాక్టర్ నీలం ఇంజెటికి పీహెచ్.డీ



**నగర నిజం మార్చి 12 సంగారెడ్డి** జిల్లా ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని నీలం ఇంజెటిని డాక్టరేట్ వరించింది. 'ప్రయోగాత్మక జంతువులలో నాడీ సంబంధిత రుగ్మతలకు వ్యతిరేకంగా సంభావ్య మూలికల యొక్క న్యూరోప్రొటెక్టివ్ ప్రభావం' అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన అల్జీమర్స్ వ్యాధిని పరిష్కరించడంలో ఔషధ మొక్కల యొక్క న్యూరోప్రొటెక్టివ్ సామర్థ్యాన్ని అన్వేషించినట్టు తెలియజేశారు. సాంప్రదాయకంగా మూలికా వైద్యంలో ఉపయోగించే మొక్కలైన ఇండిగోఫెరా ప్రోస్ట్రాటా, లాంటానా కమారా యొక్క ఫైటోకెమికల్, చికిత్సా లక్షణాలపై ఈ అధ్యయనం దృష్టి సారించిందన్నారు. సిలికో మాలిక్యులర్ డాకింగ్, జీసీ-ఎంఎస్ విశ్లేషణ, ప్రయోగాత్మక జంతు అధ్యయనాలలో అధునాతనమైన పురోగతి ద్వారా, పరిశోధన అమిలాయిడ్-బీటా, ఎసిటైల్ కోలినెస్టేరేస్‌తో సహా కీలకమైన అల్జీమర్స్ వ్యాధి లక్షణాలతో మొక్కల నుంచి ఉత్పన్నమైన సమ్మేళనాల యొక్క ఆశాజనక పరస్పర చర్యలను ప్రదర్శించినట్టు వివరించారు. ప్రయోగాత్మక నమూనాలలో గణనీయమైన యాంటీఆక్సిడెంట్ కార్యకలాపాలు, జ్ఞాపకశక్తి, అభ్యాసంలో మెరుగుదల కూడా ఈ పరిశోధన ఫలితాలు తేల్చాయని, ఇది మొక్కల బలమైన న్యూరోప్రొటెక్టివ్ సామర్థ్యాన్ని వెల్లడిస్తోందన్నారు. ఈ మూలికా వనరులు అల్జీమర్స్ వ్యాధికి కొత్త చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడతాయని, తదుపరి క్లినికల్ పరిశోధనలను ప్రోత్సహిస్తాయని అధ్యయనం సూచిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ నీలం సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## భూ భారతి చట్టం ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**నగరనిజం తాండూర్ ప్రతినిధి మార్చ్ 12 ::** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం లోని పెద్దేముల్ మండలం, గిర్మాపూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతిసమగ్ర భూసర్వే కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సర్వే జరుగుతున్న రైతు రాంరెడ్డి పొలాన్ని సందర్శించి, రైతులతో పాటు సర్వేయర్లతో నేరుగా మాట్లాడి సర్వే సమయంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రక్రియను స్వయంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం, ధరణి స్థానంలో భూ





భారతి వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. గత బిఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థ గందరగోళానికి గురైందని విమర్శించారు. రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో అధికారులు గ్రామాలకే వచ్చి సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా అన్నారు. భూమి యొక్క పట్టా సర్వే నెంబర్ స్థానంలో భూదార్ నెంబర్ ప్రవేశ పెట్టబడుతుందని వివరించారు. భూ సర్వేలో భాగంగా పట్టా భూమి, గ్రామకంఠం, ప్రభుత్వ భూములను స్పష్టంగా వేరు చేసి గుర్తించడం జరుగుతుందని తెలిపారు. భూమి సర్వే చేసే సమయంలో ఎదురయ్యే సమస్యలను రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు పారదర్శకమైన, సుస్థిరమైన భూ రికార్డు వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివరాం నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, నాయకులు లొంక నర్సింలు, రాంరెడ్డి తోపాటు రెవిన్యూ అధికారులు పలువురు పాల్గొన్నారు.

# తక్కువ ధరకే కార్పొరేట్ వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం






- ప్రజల ఆశీస్సులతోనే శంషాబాద్ వద్ద 6వ బ్రాంచీని నెలకొల్పినట్లు ప్రకటన
- పేద ప్రజల కోసమే కార్పొరేట్ ఆసుపత్రిని స్థాపించినట్లు ప్రకటించిన రామరాజ్

**రాజేంద్రనగర్, మార్చి 12 (నగరనిజం ప్రతినిధి):** పేద ప్రజలకు తక్కువ ధరకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలన్నదే తమ లక్ష్యం అని నిమ్స్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ రామరాజ్ ప్రకటించారు. గుండెపోటుకు గురైన ఎందరో సామాన్య మధ్యతరగతి కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలు పెట్టి వైద్యం చేయించుకోలేక ప్రాణాలు వదులుతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకొనే తాము కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో కూడిన న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద లిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యూరాలజీ,కార్డియాలజీ ఆసుపత్రిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన లిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రామరాజ్.... శంషాబాద్ వద్ద నెలకొల్పిన కార్డియాలజీ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన గుండె వైద్య నిపుణుల చేత తక్కువ ధరకే సామాన్య మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించబోతున్నట్లు ప్రకటించారు. ప్రజలు అందించిన సహకారంతోనే ఇప్పటివరకు షాద్నగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజక వర్గాల పరిధిలో ఐదు బ్రాంచీలు నెలకొల్పగా తాజాగా ఆరవ బ్రాంచీని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గుండెపోటుకు గురవుతున్న ఎందరో నిరుపేదలు అత్యవసర వైద్య సేవల కోసం హైదరాబాద్ చేరే లోపు ప్రాణాలు కోల్పోతున్నారని డాక్టర్ రామరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సామాన్య మధ్యతరగతి ప్రజలు వైద్య సేవలు అందుకోలేకపోతు న్నారని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పేద, మధ్యత రగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే ప్రధాన లక్ష్యంతో శంషాబాద్ వద్ద న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. షాద్నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ ప్రోద్బలంతోనే షాద్నగర్, శంషాబాద్ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధనార్థన కోసం అన్నట్లుగా కాకుండా సేవా దృక్పథంతో ఆసుపత్రిని కొనసాగించాలని వీర్లపల్లి శంకర్ చేసిన సూచన ప్రకారం తాము ఈ వృత్తిని కొనసాగిస్తున్నట్లు డాక్టర్ రామరాజ్ గర్వంగా ప్రకటించారు. భవిష్యత్తులో ఇదే తరహాలో పేద మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ రామరాజు ప్రకటించారు. అనుభవజ్ఞులైన వైద్యుల చేత న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రి లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతోనే తాము ప్రస్తుతం 6వ బ్రాంచీని నెలకొల్పడం జరిగిందని డాక్టర్ రామరాజు వివరించారు. ఈ ప్రయాణంలో తనతో పాటు కలిసి వస్తున్న సహచర వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

## డార్క్‌మోడ్‌లోకి చమురు నౌక.. హర్మూజ్‌లో డేరింగ్

**హైదరాబాద్,నగరనిజం:** పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హర్మూజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావరణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే. దీనిని నడిపిన కెప్టెన్ కూడా ఇండియనే. అసలు ఆ షిప్ గమ్యస్థానానికి ఎలా చేరిందంటే..? లైబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ చమురు ట్యాంకర్ బుధవారం ముంబయి నౌకాశ్రయానికి చేరుకుంది. మూడురోజుల క్రితమే అది హర్మూజ్‌ను దాటింది. తన ప్రయాణాన్ని ఎవరూ ట్రాక్ చేయకుండా చురుగ్గా వ్యవహరించింది. మార్చి ఒకటిన ఈ ట్యాంకర్ సౌదీ అరేబియా పోర్ట్ వద్ద చమురు లోడ్ చేసుకుంది. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. దాని సిగ్నల్స్ మార్చి 8న హర్మూజ్‌లో కనిపించాయి. ఆ తర్వాత అది జాడలేకుండా పోయింది. నౌకలోని సిబ్బంది ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్, ట్రాన్స్‌పాండర్లను స్విచ్చాఫ్ చేశారని తెలుస్తోంది.

### చీకటిలోకి వెళ్లిపోయి..

ప్రస్తుతం అడుగడుగునా ప్రమాదకరంగా మారిన హర్మూజ్‌లో గుర్తింపు తెలియకుండా సిబ్బంది ఈ నిర్ణయం తీసుకున్నారు. జలసంధిని దాటి ఇండియా దిశగా ప్రయాణిస్తున్నప్పుడు.. అంటే ఒకరోజు తర్వాత మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్స్‌లో ఈ షిప్ కనిపించింది. సంక్షోభ సమయాల్లో ప్రత్యర్థులకు చిక్కకుండా ఉండేందుకు అసాధారణ పరిస్థితుల్లో షిప్పింగ్ కంపెనీలు ఈ టెక్నిక్‌ను వాడుతుంటాయి. దీనిని గోయింగ్ డార్క్‌గా చెప్తుంటారు. అంతర్జాతీయ సముద్రయాన నిబంధనల ప్రకారం.. భద్రత, రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఏఐఎస్‌ను ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంచాలి.ఇక, ఇప్పుడు ముంబయికు షెన్‌లాంగ్.. 1,35,335 మెట్రిక్ టన్నుల చమురును మోసుకొచ్చింది. గ్రీస్‌లోని డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఈ నౌక కార్యకలాపాలు చూస్తోంది. 29 మంది సిబ్బందిలో భారతీయుల తో సహా పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ జాతీయులు ఉన్నారు. కెప్టెన్ సుఖ్జాంత్ సింగ్ సింధు భారతీయుడే. హర్మూజ్ అంతరాయాలతో భారత్‌లో ఇంధన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో షెన్‌లాంగ్ విజయవంతంగా దేశానికి చేరడం, మరోవైపు భారత పతాక నౌకలు హర్మూజ్‌నుంచి వెళ్లొచ్చని ఇరాన్ అనుమతిచ్చినట్లు వార్తలు రావడం ఊరటనిస్తోంది.

## శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేద్దాం మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డి



**మొయినాబాద్,మార్చి 11 (నగర నిజం):** శాంతిభద్రతలలో అందరు కృషి చేద్దామని మొయినాబాద్ సీఐ మల్లికార్జున్రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు మోత్కుపల్లి రాములు, మోత్కుపల్లి సర్పంచ్ సంపూర్ణ, సర్దార్నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామస్తులతో కలిసి సీఐని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మొయినాబాద్కు సీఐగా రావడంతో ఆయనకు మోత్కుపల్లి గ్రామస్తులు, వార్డు సభ్యులు సన్మానించారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అంతర్గత అండర్ డ్రైనేజ్ పనులను ప్రారంభించిన సర్పంచ్ వెంకటేష్ గౌడ్



**మొయినాబాద్, మార్చి 12 (నగర నిజం):** మొయినాబాద్ మండల కేంద్రంలోని బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో 9, 10వ వార్డులలో అంతర్గత అండర్ డ్రైనేజ్ లేదని గుర్తించి గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మరియు వార్డు సభ్యులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలన్నిటిని ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కార దిశగా ముందుకు వెళ్తామని గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించే విధంగా ముందుకు వెళతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, రాయనోళ్ల ఉపేందర్ యాదవ్, బంధి అనిల్, కొండకల్ల రవి, దినేశ్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్, కరోబర్ జగన్నాథ్ నాయకులు పి రాఘవరెడ్డి, కొండకల్ల మహేందర్, బిక్షపతి గౌడ్,కొండకల్ల శ్రీకాంత్, కావాలి కిరణ్, విజయ్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత ఇంటికి సీబీఐ అధికారులు

**హైదరాబాద్,నగరనిజం:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇంటికి సీబీఐ అధికారులు వచ్చారు. దిల్లీ మద్యం కేసులో సీబీఐ అభియోగాలు నిరాధారంగా ఉన్నాయని ఇటీవల రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై దర్యాప్తు సంస్థ సీబీఐ హైకోర్టులో అప్పీల్ చేసింది. ఈ నేపథ్యంలో సమన్లు ఇచ్చేందుకు అధికారులు కవిత ఇంటికి చేరుకున్నారు.సీబీఐ నోటీసులపై కవిత స్పందించారు. ఈ నెల 16న విచారణకు హాజరు కావాలని సీబీఐ అధికారులు తెలిపారన్నారు. నోటీసులపై తన లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు విచారణలో అధికారులకు సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు.

## ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళుతూ....తిరిగిరాని లోకాలకు

- పెద్ద షాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు యువకులు మృతి
- మృతుల్లో ఇంటర్ విద్యార్థి
- లారీ అదుపుతప్పి బైకును ఢీకొట్టడంతో ప్రమాదం





**రాజేంద్రనగర్, మార్చి 12 (నగరనిజం ప్రతినిధి):** శంషాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకరు ఇంటర్ విద్యార్థి కూడా ఉన్నారు. ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్తూ ఇంటర్ విద్యార్థితోపాటు స్నేహితుడు సైతం ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ఘటన శంషాబాద్ పరిధిలోని పెద్ద షాపూర్ వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి కథనం ప్రకారం ఈ ఘోర రోడ్డు ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా కొత్తూరు పరిధిలోని నారాయణగూడ కాలనీకి చెందిన సూరజ్ అనే ఇంటర్ విద్యార్థి శంషాబాద్ లో ఇంటర్ ఎగ్జామ్ రాస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటర్ పరీక్ష రాయడం కోసం శంషాబాద్ బయలుదేరాడు. అయితే అతని స్నేహితుడైన విక్కీ సూరజ్ ను శంషాబాద్ లోని పరీక్షా కేంద్రం వద్ద దింపడానికి గాను బైక్ పై ఎక్కించుకొని బయలుదేరాడు. అయితే శంషాబాద్ సమీపంలోని మదనపల్లి - పెద్ద షాపూర్ వద్దకు రాగానే అదుపు తప్పిన వేగంతో దూసుకొచ్చిన లారీ వీరి బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి సూరజ్ తోపాటు అతని స్నేహితుడు విక్కీ సైతం తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో సూరజ్ ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మరోవైపు స్నేహితుడిని ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద దించడానికి బైక్ పై వెళ్తూ విక్కీ సైతం ప్రాణాలు కోల్పోవడంతో అతని కుటుంబంలో కూడా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విక్కి కొత్తూరు వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో ఇంజనీయర్ గా ఉద్యోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలాన్ని సందర్శించిన శంషాబాద్ పోలీసులు.... యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ మితిమీరిన వేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేందర్ రెడ్డి ప్రకటించారు.




## డాక్టర్ రామరాజ్ బృందాన్ని అభినందించిన కాంగ్రెస్ నేత కొడిగంటి చంద్రారెడ్డి





**రాజేంద్రనగర్, మార్చి 12 (నగరనిజం ప్రతినిధి):** శంషాబాద్ వద్ద న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చిన లిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రామరాజ్ తో పాటు ఆయన సహచర వైద్య బృందాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత కొడిగంటి చంద్రారెడ్డి అభినందించారు. పేద ప్రజలకు తక్కువ ధరకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలో అందించేందుకు ముందుకు వస్తున్న డాక్టర్ రామరాజు బృందాన్ని ఆయన అభినందించారు. శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి వద్ద నిమ్స్ హాస్పిటల్ న్యూరాలజీ కార్డియాలజీ హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్నారు కాంగ్రెస్ సీనియర్ నేత కొడిగంటి చంద్రారెడ్డి. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రామరాజ్ కు చంద్రారెడ్డి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. శంషాబాద్ వద్ద కార్డియాలజీ ఆసుపత్రి అందుబాటులో లేకపోవడంతో గుండెపోటుకు గురైన సమయంలో రోగులను హైదరాబాద్ కు తరలించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను హైదరాబాద్ కు తరలించే లోపు సకాలంలో వైద్య సేవలు అందక ఎందరో అమాయకులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని చంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే శంషాబాద్ వద్ద ఇప్పటికే మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని కొనసాగిస్తున్న డాక్టర్ రామరాజు సారథ్యంలోని వైద్యుల బృందం పేద మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరకే వైద్య సేవలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు. ప్రజల ఆదరణతోనే నిమ్స్ హాస్పిటల్ దినదినాభివృద్ధి చెందుతోందని చెప్పారు. శంషాబాద్ వద్ద తొలిసారిగా కార్డియాలజీ ఆసుపత్రి అందుబాటులోకి రావడం శుభ సూచకమని చంద్రారెడ్డి అభిప్రాయపడ్డ. శంషాబాద్ వద్ద తక్కువ ధరికే మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఏకైక లక్ష్యంతో కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో కూడిన ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు లిమ్స్ హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శంషాబాద్ వద్ద హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి పక్కన నెలకొల్పిన లిమ్స్ కార్డియాలజీ ఆసుపత్రి వల్ల శంషాబాద్ తో పాటు మహేశ్వరం, షాద్నగర్, జడ్చర్ల ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, శంషాబాద్ మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ ,మాజీ కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్, పగుడాల శ్రీనివాస్ గౌడ్, చేవెళ్ల కవితా ప్రసాద్, మాజీ సర్పంచ్ దండు ఇస్త్రారి, స్థానిక నేత యూఎస్ పాండు పాల్గొన్నారు.

# పటాన్చెరులో అంబరాన్ని అంటిన మహిళా దినోత్సవ సంబరాలు

- పటాన్చెరుకు తరలి వచ్చిన మహిళలోకం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..
- ఆలోచింపచేసిన ఉపన్యాసాలు..
- మార్పు ఇంటి నుండి మొదలు కావాలి
- ప్రతి మహిళా ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలి..
- ప్రత్యేక క్యాంపుల ద్వారా హెచ్ పి వి వ్యాక్సిన్ పంపిణీ
- మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**నగర నిజం మార్చి12** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి ల ఆధ్వర్యంలో గురువారం పటాన్చెరు పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. నియోజకవర్గ పరిధి లోని మహిళా ప్రజా ప్రతినిధులు, వేలాదిమంది మహిళలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుండి సాయం త్రం వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రముఖులచే ఉపన్యాసాలు, బహుమతుల పంపిణీ కార్యక్రమాలు అందరిని ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఒక కుటుంబంలో మహిళా విద్యావంతురాలు అయితే ఒక తరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. సర్వైకల్ క్యాన్సర్ విముక్తి కోసం ప్రభుత్వం అందిస్తున్న హెచ్ పి వి వ్యాక్సిన్ ను బాలికలతో మొదలు మహిళలందరూ వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన పక్షంలో పటాన్చెరు నియోజకవర్గం లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి మహిళకు వ్యాక్సిన్ అందిస్తామని హామీ ఇచ్చారు. గత 25 సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆడ కూతురు ఉన్నత చదువులు చదువుకోవాలన్న సమున్నత లక్ష్యంతో పటాన్చెరు పట్టణంలో కేజీ నుండి పీజీ వరకు ఆధునిక వసతులతో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిం దని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు వంటిల్లు నుండి అంతరిక్షం వరకు తమ సత్తా చాటుతున్న నేటికీ గృహ హింసకు గురి కావడం బాధాకరమన్నారు. మహిళల పట్ల మార్పు తమ గృహాల నుండే మొదలు కావాలని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళల ఆర్థిక సమృద్ధికి పెద్దపీట వేస్తూ వేల కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తు చేశారు. ప్రముఖ వైద్యులు, ఎమ్మెల్యే జిఎంఆర్ కోడలు గూడెం కిరణ్మయి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళా విజయం వెనుక ఎందరో మహిళల త్యాగం నెలకొని ఉందని తెలిపారు. మహిళ ఆర్థిక అభ్యున్నతి, ఉన్నత అవకాశాలు పొందాలంటే సంపూర్ణ సహకారం అందించాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కుటుంబానికి వెన్నెముకగా నిలిచే మహిళ తన ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం విధిగా ఆరోగ్య చికిత్సలు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్ పి వివ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలని కోరారు. అవసరమైన పక్షంలో జిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మహిళల పట్ల ఏ విధంగా ప్రవర్తించాలో బాల్యం నుండే అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ కవితా రెడ్డి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఆర్తి, ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి లు ప్రసంగించారు. మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశా రు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా ప్రజాప్రతిని ధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిదులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి






- పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వం యొక్క లక్ష్యం
- రాష్ట్ర రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి

**రంగారెడ్డి ప్రతినిధి, మార్చి 12 ( నగరనిజం ) :** ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్యతలు ఉన్నాయని, ప్రజలతో మమేకమై పనులు చేసినప్పుడే ప్రజల మన్ననలను పొందుతారని అన్నారు. మున్సిపల్ పట్టణాలలో ప్రజలు అనేక సమస్యలతో ఉంటారని, వారి సమస్యలను తెలుసుకొని వాటిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా విద్యతోనే మార్పు వస్తుందని ప్రతి ఒక్కరు చదువుకునేలా చూడాలని, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పారిశుధ్యం పై దృష్టి సారించాలని, మున్సిపాలిటీలను సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ,వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందించాలని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై దృష్టి సారించా లని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పనిచేసి అభివృద్ధి, సంక్షేమాన్ని సాధించాలని కలిసికట్టుగా పనిచేస్తే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. అభివృద్ధితో పాటు, రోడ్డు భద్రత ,యువత మత్తుపదార్థాల బారిన పడకుండా ఉండడం, తదితర సామాజిక అంశాలపై కూడా దృష్టి సాధించాలని తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.కె.శ్రీదేవి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్లకు, కౌన్సిలర్లకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం సంతోషమని, నూతన ప్రజాప్రతినిధులు ప్రజల్లో ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన తీసుకుని వెళ్లాలని, ప్రజల కోసం పనిచేయాలని, ప్రజాక్షేత్రంలో ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అమలులో భాగంగా క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, కౌన్సిలర్లు దృష్టి సారించాలన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు ప్రజల సమస్యలు తెలుస్తాయని, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మమేకమై ప్రజలకు సౌకర్యాలు, సేవలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగాదికి సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను షెడ్యూల్ ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి శాఖల ద్వారా అమలు చేసే పలు ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, వీడియోల ద్వారా మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్కేవీవై కూరగాయల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పక్షుల దాహార్తికై నీటి తోట్ల ఏర్పాటు

**ఇబ్రహీంపట్నం, మార్చి 12 ( నగరనిజం ) :** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగాల ఆధ్వర్యంలో గురువారం వేసవికాలంలో పక్షుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్లను కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. కళాశాలలో పెరిగిన పిచ్చి మొక్కలు ఎండిపోకుండా నీటిని పోయడం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రాధిక, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, జాతీయ సేవా విభాగ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్ రమేష్, డాక్టర్ చింతల రాకేష్ భవాని, డాక్టర్ ఏ రచనలు, ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.



## యువత వ్యసనాలకు దూరంగా ఉండి.. మహనీయుల బాటలో నడవాలి

- ఎస్సై యుగంధర్
- మండల కేంద్రంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి గోడపత్రిక ఆవిష్కరణ




**వలిగొండ మార్చి 12( నగర నిజం)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోనిడ్రగ్స్, ఆన్లైన్ బెట్టింగ్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు.క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోని కుటుంబాల్లో తీరని శోకం నింపొద్దు.సేవా దృక్పథంతో సమాజ అభివృద్ధికి తోడ్పడాలి.విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల 95వ వర్ధంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను ఎస్సై యుగంధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత పెడదోవ పడుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వ్యసనాల కోరల్లో యువతయువత డ్రగ్స్, గంజాయి వంటి ప్రాణాంతక మాదకద్రవ్యాలకు మరియు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలు కావొద్దని ఎస్సై హెచ్చరించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా, మానసిక ఒత్తిడికి లోనై క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇది వారి కుటుంబాలకు తీరని అన్యాయం చేయడమేనని అన్నారు.

### డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ..ఆరోగ్యం: డ్రగ్స్ మెదడు మరియు శరీర అవయవాలను నిర్వీర్యం చేస్తాయి.భవిష్యత్తు: ఒక్కసారి కేసుల్లో ఇరుక్కుంటే ప్రభుత్వ ఉద్యోగాలకు, విదేశీ ప్రయాణాలకు అనర్హులవుతారు.కుటుంబం: ఒక వ్యక్తి వ్యసనానికి బానిస అయితే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, సామాజికంగా పతనమవుతుంది.“యువత తమ విలువైన జీవితాన్ని కాపాడుకోవాలి. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆలోచనా విధానాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవా దృక్పథంతో ముందుకు సాగాలి“ అని ఆయన పిలుపునిచ్చారు.పాల్గొన్న వారు:ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మారోజు నరసింహాచారి, గుండెగాని నాగరాజ్, సలిగంజి కృష్ణ కుమార్, మెట్టు లక్ష్మణ్ నారాయణ, నరేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులు , అధికారులు సమన్వయంతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో: నగర నిజం: తేదీ 12-3-2026.** ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు, సర్పంచులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నోడల్ అధికారి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వనంచేసి , తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయ హే.. తో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. పట్టణ ,గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక బృహత్కర కార్యక్రమం ఇది అని అన్నారు. గ్రామ సర్పంచులు గ్రామం నాది అనే స్వభావాన్ని కలిగి ఉండాలన్నారు. 99 రోజుల్లో అనేక కార్యక్రమాల చేపడుతునట్లు చెప్పారు. సుబిక్షమైన పట్టణ ,పల్లెల కోసం నిరంతరం కృషి చేయాలన్నారు.శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ..ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల అబివృద్ధి , ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం నిరతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, జీరో విద్యుత్,సన్నబియ్యం,మెడికల్ కాలేజీ,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం లాంటి అనేక పథకాలు చేపట్టామన్నారు.అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను తీర్చి, పథకాలు ముందుకు తీసుకెళ్లాలన్నారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శాంతి భద్రతను కాపాడాలని,రోడ్డు ప్రమాదాల వల్ల రోజు రోజుకు మరణాల సంఖ్య పెరుగుతుందని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి,డ్రగ్స్,సైబర్ క్రైమ్ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.నోడల్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పట్టణ,గ్రామీణ ప్రజా ప్రతినిధుల పదవి చిన్నదైన బాధ్యత పెద్దదన్నారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా అవసరాలను తీర్చాలన్నారు.అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..పట్టణ,గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి, పరిష్కారం చూపించాలన్నారు .అంతకు ముందు సమాచార పౌర సంబంధాల శాఖ మెదక్ జిల్లా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల ఫోటోల ఎగ్జిబిషన్ ను అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తిలకించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE